సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 27 । నవంబర్ । 2024



## ఉద్యమాలు ఉద్ధృతం

ఆల్‌ట్రేడ్ యూనియన్లు నిరసన గళం వినిపించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

- 8లో



## హాస్టల్ విద్యార్థుల ఆందోళన

కురిగాం ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. వార్డెన్ తీరుపై ఆరోపణలు చేశారు.

- 8లో

## జాతీయ ఉషూ పోటీల్లో దేవీప్రసాద్‌కు కాంస్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎ.దేవీప్రసాద్ సత్తాచాటాడు. జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అండర్-17 బాలబాలికల ఉషూ పోటీల్లో దేవీప్రసాద్ కాంస్య పతకం సాధించి సిక్కోలు ఖ్యాతిని చాటిచెప్పాడు.

## న్యూస్‌రీల్

### శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ. 8.22 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.8,22,389 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు, సత్యసాయి భక్తుల సమక్షంలో ఆదాయం లెక్కించామన్నారు. ఇందులో ప్రత్యేక దర్శనం టికెట్ల ఆదాయం రూ.2.45,600 రాగా హుండీ ఆదాయం రూ.5,67,869 కాగా పుస్తకాలు, ఫొటోలు, ఇతర ఆదాయాలు కలిపి రూ.8,22,389 వచ్చిందన్నారు. కాగా గత ఏడాది ఆదాయం రూ.5,94,380 వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం రూ. 2,28,009 అదనంగా పెరిగింది.

### పేదలందరికీ ఎన్‌టీఆర్ కాలనీలు మంజూరు చేస్తాం



అధికారులతో సమీక్షిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: జిల్లాలోని పేదలందరికీ ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా కాలనీలు మంజూరు చేస్తామని అర్హులైన లబ్ధిదారులు వారి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత అధికారులు లబ్ధిదారుల వద్దకు వచ్చి విచారించి కాలనీ ఇల్లు మంజూరు చేస్తారని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పలుశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. టెక్కలిలో అన్ని హంగులతో ఆదర్శ కాలనీ నిర్మిస్తామని మంత్రి తెలిపారు.

### ఐదు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో 5.170 కేజీల గంజాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. సీఐ కార్యాలయంలో మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశాల్‌యాదవ్ అనే వ్యక్తి ఒడిశాలో కందమాల్ జిల్లా నుంచి గంజాయిని కొనుగోలు చేసి ముంబైకి తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. అతడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

## అధ్యక్షా..



లావేరు మండలం బయ్యన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా విద్యార్థుల మాక్ అసెంబ్లీ ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు అసెంబ్లీ నిర్వహణపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. స్పీకర్, పాలక పక్షం, ప్రతి పక్షంగా విద్యార్థులు వ్యవహరించి చర్చ సాగించారు. - ఎచ్చెర్ల

## స్వేచ్ఛా జీవనానికి రాజ్యాంగమే ఆధారం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

స్వేచ్ఛా జీవనానికి రాజ్యాంగం ఆధారమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. భారత రాజ్యాంగ పీఠికను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు అప్పారావు, పద్మావతి, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్య ప్రకాశరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బి.కరుణ శ్రీ ఉన్నారు. - శ్రీకాకుళం పాతబస్టాండ్

# కొనుగోళ్లు గిల్లుకుంటున్నారా..?



జి.సిగడాం: మానంపేటలో ధాన్యంను కాపాడుకుంటున్న రైతులు



టెక్కలి రూరల్: తొలిసూరుపల్లిలో చేతికి అందిన పంటను కోసి కుప్పలుగా పెడుతున్న రైతు



వజ్రపుకొత్తూరు రూరల్: తురకలకోటలో వరి చేనును ట్రాక్టర్ ఎక్కిస్తున్న రైతులు

వాయుగుండంతో రైతు గుండెల్లో గుబులు రేగుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం రాశులను పొలాల్లో ఉంచలేక కంగారు పడుతున్నారు. - జి.సిగడాం

తుఫాన్ ముప్పు ముంచుకు వస్తుండడంతో రైతులు ఆదరాబాదరగా వరి కోతలు కోసి కుప్పలు వేస్తున్నారు. వాన పడినా పంట నష్టపోకుండా ముందస్తుగా జాగ్రత్త పడుతున్నారు. - టెక్కలి రూరల్

జిల్లాలో కోతలు జోరందుకున్నాయి. తుఫాన్ హెచ్చరిక వినిపిస్తుండడంతో కోత జరిగిన పొలాల్లో వరి పన్నలను ట్రాక్టర్లపై ఎక్కించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. - వజ్రపుకొత్తూరు రూరల్

- వ్యవసాయ శాఖమంత్రి జిల్లాలో దయనీయ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోళ్లు
- 402 కొనుగోలు కేంద్రాలకు గాను 13 మాత్రమే ప్రారంభం
- వాయుగుండం ఎఫెక్ట్‌తో రైతు గుండెల్లో గుబులు
- చేతికొచ్చిన పంట వర్షార్పణం అవుతుందేమోనని ఆందోళన
- తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్న దుస్థితి





జి.సిగడాం: పెంటలో ధాన్యపురాశి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమవుతోంది. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేశామని, రైతుల సమయం వృథా కాకుండా వాట్సప్ ద్వారా సేవలందిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఓ వైపున చెబుతున్నా.. ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. వాట్సాప్ మెసెజ్‌లపై స్పందన పక్కన పెడితే కనీసం కొనుగోలు కేంద్రాలే ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు 13 కేంద్రాలే ప్రారంభించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట్ల ఇంకెలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

**పాలకులు ఫెయిల్**

జిల్లాలో 3లక్షల 60వేల 325ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు అయింది. 7లక్షల 24వేల 667మెట్రిక్ టన్నుల మేర దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. అందులో రైతులఅవసరాలు పోను 4లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల మేర సేకరించాల్సి ఉంది. ఈ మేరకు 402 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఆచరణలో పెట్టడంలో పాలకులు విఫలమయ్యారు.

**వణికిస్తున్న వాయుగుండం..**

జిల్లాలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి, శ్రీకాకుళం, గార, సరుబుజ్జిలి, కొత్తూరు, ఎల్‌ఎన్‌పేట, హిరమండలం, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 80 శాతం మేర కోతలు జరిగాయి. టెక్కలి, పలాస డివిజన్‌లలో కూడా 50శాతం మేర కోతలు పూర్తయ్యాయి. నూర్పులు వేసి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ఈ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాలి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి. ఈ ప్రక్రియ కనీసం జరగకపోవడంతో పండిన పంట ఎక్కడికక్కడ పొలాల్లోనే ఉంది. ఇదే సమయంలో అల్పపీడనం ఏర్పడటం, అది వాయుగుండంగా మారి దూసుకొస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. చేతికొచ్చిన పంటకు ఎక్కడ నష్టం వస్తుందేమోనని భయపడుతున్నారు. ఉన్న ఫలంగా వర్షాలు పడితే పండిన పంట తడిచి ముద్ద అయిపోతుంది. వరదలొస్తే ముంపునకు గురవుతుంది. ఫలితంగా పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు పరుగులు తీస్తున్నారు. కోసిన పంటను దాచుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. నూర్చిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం అన్నదాతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఏమవుతుందోనని భయం భయంతో గడుపుతున్నారు.

**దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి..**

కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో దళారులను రైతులు ఆశ్రయించక తప్పడం లేదు. వారు ఎంత చెబితే అంత రేటుకు ఇచ్చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవంగా 100 కిలోల ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ.2320, కామన్ రకానికి రూ.2300 మద్దతు ధర రావాల్సి ఉంటుంది. కానీ, ప్రైవేటు వర్తకులకు అమ్ముకోవాల్సి రావడంతో మద్దతు ధరను కోల్పోతున్నారు. 100కిలోల బస్తాను రూ.1700, 1800కు అమ్ముకుంటున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. ఇదే అవకాశంగా తీసుకుని కొందరు మిల్లర్లు కూడా దళారుల అవతారమెత్తి, రైతులను ట్రాప్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

**కొరవడిన ముందు చూపు**

సాధారణంగా కొనుగోలు కేంద్రాలను కోతలు ప్రారంభమయ్యే సమయానికే ఏర్పాటు చేయాలి. అందుకు తగ్గట్టుగా కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలి.

కానీ వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలో అటువంటి సన్నద్ధత జరగలేదు. ఒక్కో కేంద్రంలో ముగ్గురు సిబ్బంది (కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, నిర్వాహకులు) ఉండాలి. వీరిని నియమించే ప్రక్రియే సకాలంలో జరగలేదు.

- అంతేకాకుండా ధాన్యం కొనుగోలు ప్రారంభం నాటికే మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుని, సేకరించిన ధాన్యం పంపించేందుకు మిల్లులను సిద్ధం చేయాలి. ఇందులో కూడా ఫెయిల్ అయ్యారు.
- జిల్లాలో 260 రైసు మిల్లులు ఉండగా కేవలం 50 మిల్లులు మాత్రమే రూ.31.90కోట్ల మేర బ్యాంకు గ్యారంటీలు ఇచ్చాయి.
- మిగతావి ఇంకా ఇవ్వలేదు. దీన్నిబట్టి ధాన్యం కొనుగోళ్లకు ఇటు కొనుగోలు కేంద్రాలు, అటు మిల్లులు ఏ రకంగా సిద్ధంగా ఉన్నాయో స్పష్టమవుతోంది.

| జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాగు చేసిన విస్తీర్ణం | దిగుబడి అంచనా | కొనుగోలు లక్ష్యం (అంచనా) | జిల్లాలో ప్రారంభం కావల్సిన కొనుగోలు కేంద్రాలు | ఇప్పటివరకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు | ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం | జిల్లాలో ఉన్న మిల్లులు | బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన మిల్లులు |
|---|---|---|---|---|---|---|---|
| 3,60,325 ఎకరాలు | 7,24,667 మెట్రిక్ టన్నులు | 4,90,000 మెట్రిక్ టన్నులు | 402 | 13 | 253 మెట్రిక్ టన్నులు | 260 | 50 |

### అప్పు చెల్లించనందుకు ఆరు నెలల జైలుశిక్ష

కాశీబుగ్గ: రూ.2 లక్షల నగదు అప్పు తీసుకొని, తిరిగి చెల్లించనందున తగిన ఆధారాలు రుజువు కావడంతో ఆ వ్యక్తికి కోర్టు ఆరుమాసాల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే.. 2015లో పలాస హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న లండ సుబ్రహ్మణ్యం వద్ద విశాఖపట్నంకు చెందిన కర్రి వెంకటరావు రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. అయితే అప్పు తిరిగి చెల్లించకపోవడంతో పాటు ఇచ్చిన చెక్‌లు చెల్లకపోవడంపై కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పలాస జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ విచారణలో విశాఖపట్నంకు చెందిన కర్రి వెంకటరావుకు ఆరు మాసాల జైలు శిక్ష విధిస్తూ రూ.2 లక్షలు తిరిగి చెల్లించాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తీర్పును వెల్లడించారు.

### ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా రాత్రి సమావేశాలు



బేతాళపురంలో పోరాట కమిటీ సమావేశాలు

కాశీబుగ్గ: ఎయిర్‌పోర్టు వద్దంటూ వ్యతిరేక సమావేశాలు మంగళవారం రాత్రి నిర్వహించారు. మందస మండలం బేతాళపురం–లక్ష్మీపురం–బహాడపల్లి గ్రామాల్లో వీధి వీధినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఎయిర్‌పోర్టు వద్దు మా భూములే ముద్దంటూ నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆరు పంచాయతీలకు చెందిన పెద్దలు, బాధితులు పాల్గొన్నారు.

### పలాస కిడ్నీ ఆస్పత్రి పరిశీలన



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం పరిశీలనలో ఎమ్మెల్సీ నర్తు రామారావు

కాశీబుగ్గ: పలాసలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ ఆస్పత్రిని ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం సందర్శించారు. స్వయంగా వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ప్రభుత్వం మారాక ఆస్పత్రి నిర్వహణ తీరు కూడా మారిందని అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజతో మాట్లాడారు. మరో వారం రోజుల తర్వాత మళ్లీ వస్తానని, ఆస్పత్రి అభివృద్ధికి సూచనలు ఇస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వంశధార కరకట్ట ధ్వంసం



ధ్వంసమైన కరకట్ట

సైరిగాం పంచాయతీ పరిధి లింగంన్నాయుడుపేట సమీపంలో వంశధార నది కరకట్ట గట్టును మంగళవారం ఇసుకాసురులు ధ్వంసం చేశారు. లింగంనాయుడుపేటకు సమీపంలో ఇసుక అక్రమంగా తరలించేందుకు అనువైన మార్గం కావడంతో కరకట్టను యంత్రాలతో తొలగించారు. ఏటా వంశధార నది వరదలకు పంట భూములు నీట మునిగిపోతున్నాయని 1990లో ప్రపంచ బ్యాంక్ నిధుల తో గట్టును వేశారు. ఈ క్రమంలో 2012లో కూడా అదనపు నిధులతో కరకట్టను మరింత పటిష్టం చేశారు. ఇదే చోట 2014-19 సంవత్సరాల్లో కూడా ఇలాగే అక్రమంగా గట్టు కొట్టి తవ్వకాలు చేయగా అప్పట్లో మీడియాలో కథనాలు రాగా గట్టును యథావిధిగా చేసి ఈ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమాలకు బీజం వేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ జెన్ని రామారావును వివరణ కోరగా పరిశీలన చేసి గట్టు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. -జలుమూరు

## ధాన్యం తడవకుండా చూడాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈనెల 29వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా చూడాలని, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి నిర్వహించిన వారపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి పోకుండా చూడాలని, రైతులకు టార్పాలిన్లు, టెంట్‌లు, గోనె సంచులు, ఇతర అవసరమైన వసతులను అందించాలని సూచించారు. ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ ఉంచి, టార్పాలిన్లు కప్పి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలని, వచ్చిన ధాన్యం వచ్చినట్టు సేకరించాలని ఆదేశించారు.

మెళియాపుట్టి మండలంలో 1000 ఎకరాలకు తక్కువ కాకుండా భూమిని సేకరించి లాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. కేంద్ర నిధులతో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకోసం ఎకరా చొప్పున భూమిని సేకరించాలని చెప్పారు. ఆయా చోట్ల ఇండోర్, అవుట్ డోర్ కోర్టులను నిర్మిస్తామన్నారు. పల్లె పండుగలో శంకుస్థాపనలు చేసిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బూర్జ, పొందూరు, సంతబొమ్మాళి మండలాలు ప్రగతిని సాధించడంలో వెనుకబడి ఉన్నాయన్నారు. వివిధ శాఖలకి నిర్దేశించిన వంద రోజుల ప్రగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డ్వామా పీడీ బి.సుధాకర్ బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సంకల్పంతోనే సన్మార్గం

- గంజాయి నియంత్రణకు సహకరించాలి
- ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, రిమ్స్ అధికారులు

**శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్ :** చదువుకునే వయసులో విద్యార్థులు చిన్న చిన్న బలహీనతలతో వ్యసనాల బారిన పడకుండా.. దృఢసంకల్పంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడమే సన్మార్గమని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించేందుకు శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ మెడికల్ కళాశాల (రిమ్స్)లో సంకల్పం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న దాడుల నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం గంజాయి వినియోగం పెరిగిపోయిందని చెప్పారు. మత్తుపదార్థాలతో మానసిక పరిపక్వత్వాన్ని కోల్పోయి నేరప్రవృత్తి వైపు దారి మళ్లి భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడితే చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఇప్పటికే ఎడిక్ట్ అయివుంటే ఎటువంటి సంకోచం లేకుండా డి–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందాలని హితవుపలికారు. కళాశాల పరిసర ప్రదేశాల్లో గంజాయి వంటి మత్తుపదార్థాలు ఎవరైనా క్రయ విక్రయాలు జరిపితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు. ఫిర్యాదు రూపంలో పోలీసులకు చేరేలా డ్రాప్ బాక్స్‌లను రద్దీ ప్రదేశాలు, ఆర్టీసీ కాంప్లెక్సులు, కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం డ్రగ్స్ వినియోగం, నియంత్రణ, కలిగే అనర్థాలపై వైద్యవిద్యార్థులు రూపొందించిన పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, స్పెషల్ బ్రాంచి సీఐ ఇమ్మాన్యుయల్ రాజు, రిమ్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు ప్రకాష్, పద్మ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విధానాలు మార్చుకోకపోతే ఉద్యమాలు ఉద్ధృతం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారాలి
- కలెక్టరేట్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ల భారీ ధర్నా



ధర్నా చేస్తున్న ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.స్రవంతి, ఎస్.కె.ఎం జిల్లా కన్వీనర్ టి.ప్రకాష్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి టి.అరుణ, ఏఐటీయూసీ నాయకులు సురేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎస్.కృష్ణవేణి, వైఎస్ఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటరావు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని దుయ్యబట్టారు. సర్వ సంపదలు సృష్టించే కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టే రైతువర్గాలను కాదని ప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. గత పదేళ్లలో కేంద్రం కార్పొరేట్లకు రూ.16.50 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందని, గత నెలలోనే అదానీ కంపెనీకి రూ.12 వేల కోట్ల రుణం మాఫీ చేసిందని గుర్తుచేశారు. విశాఖస్టీల్ ప్లాంట్‌తో సహా ఇతర భారీపరిశ్రమలు, గనులు, సముద్రతీరాలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్ముతాం లేదా మూసివేస్తామనే విధానాన్ని కేంద్రం అమలుచేస్తోందని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని మండిపడ్డారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని చెప్పారు. 2021లో రైతాంగ చారిత్రాత్మక పోరాట ఫలితంగా మూడు రైతు నల్ల చట్టాలు రద్దు అయ్యాయని, స్వామినాథన్ సిఫారసుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధరలు మాత్రం అమలు కావడం లేదన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మికవర్గాన్ని చీల్చాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

**డిమాండ్లు నెరవేర్చాలి..**

కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబరు కోడ్లను వెంటనే రద్దు చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను విరమించుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. మందస, పలాసలలో జీడి, రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. జీడి పంటలకు 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శ్యాంక్రగ్ పిస్టన్స్ రింగ్స్ పరిశ్రమ యాజమాన్యం 30 ఏళ్ల సర్వీస్ పేరుతో కార్మికులను అక్రమంగా తొలగించడం ఆపాలన్నారు. నీలం జూట్ మిల్ అక్రమ లాకౌట్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీపాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి చామర్తి భాస్కరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పొందూరు చంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ప్రసాదరావు, జి.సింహాచలం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షణ్ముఖరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్.రాజశేఖర్, ఎస్.వి.రమణ, హెచ్.ఈశ్వరరావు, ఎస్.షణ్ముఖరావు, టి.త్రినాథరావు, ఎస్.బలరాం, కె.కళ్యాణి, బి.ఉత్తర, ఎం.అప్పలనరసయ్య, ఎల్.రామప్పడు, ఎం.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుడికి కలెక్టర్ అభినందనలు



సాక్షిత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** హర్యానా రాష్ట్రం పంచ్‌కులా వేదికగా ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు జరగనున్న 38వ జాతీయ సబ్ జూనియర్ కూర్గీ, 13వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన జామి సాక్షిత్ ఎంపిక కావడం పట్ల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం అభినందించారు. ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సాక్షిత్ స్వర్ణ పతకం సాధించాడు. అదే పోటీలకు జాతీయ రిఫరీగా శ్రీకాకుళం నగరానికి చెందిన తైక్వాండో కోచ్ మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు నొపడ విజయ్‌కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్‌వర్మ, బలభద్రుని రాజా, కంఠ వేణు, గురుగుబెల్లి ప్రసాద్, బెవర జ్యోతిప్రసాద్, వాంద్రంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జాతీయ పోటీల్లో పవన్‌సాయి ప్రతిభ



కాంస్య పతకంతో పవన్‌సాయి

**రణస్థలం:** జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ క్రీడా పోటీల్లో రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మామిడి పవన్ సాయి సత్తాచాటాడు. ఈ నెల 19 నుంచి 21 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగిన పోటీల్లో 70–75 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు, గతంలో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పవన్‌సాయిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

## విధులకు ఆటంకపరిచాడంటూ ఎస్‌ఐ ఫిర్యాదు

**శ్రీకాకుళం క్రైమ్ :** విధుల్లో ఉన్న తనను ఆటంకపర్చాడంటూ సాయంకాల పత్రికా విలేకరి పవన్‌పై శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ–2 రామారావు అదే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 353 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ రాత్రి దమ్మలవీధికి చెందిన వ్యక్తితో వాగ్వాదం, దాడి జరుగుతుండగా సిబ్బందితో వెళ్లిన తనను పవన్ అడ్డుపడి విధులకు తీవ్రంగా ఆటంకపర్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా, ఇల్లు నిర్మించుకునేటప్పుడు డబ్బులు డిమాండ్ చేశారనే కారణంతో ఇప్పటికే పవన్‌పై ఓ దళిత మహిళ (రేజేటి శిరీష) ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టింది. రెండేళ్లుగా తనను వేధిస్తున్నట్లు ఓ ప్రతిష్టాత్మక డిగ్రీ కళాశాల మహిళా ప్రిన్సిపాల్ సైతం నేషనల్ హ్యూమన్ కమిషన్‌లో కొద్దిరోజుల కిందట ఫిర్యాదు చేశారు.

## వసతి గృహం విద్యార్థుల ఆందోళన



కురిగాం వసతి గృహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**కొత్తూరు:** మండలంలోని కురిగాం ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్ సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సరైన వసతి లేక రాత్రివేళ అవస్థలు పడుతున్నామన్నారు. మెనూ కూడా పాటించడం లేదని నినాదాలు చేశారు. వార్డెన్ లేకపోవడంతో సర్పంచ్ సేపాన అశోక్, మాజీ సర్పంచ్ కేతు కూర్మనాయకులు, విద్యాకమిటీ చైర్మన్ ఫల్గుణరావుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. తమ సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

## 'పీఎం సూర్యఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా

**నరసన్నపేట:** సంప్రదాయ ఇంధన వనరులను వినియోగించుకుని కాలుష్యాన్ని నియంత్రించాలని, దీనిలో భాగంగా రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా కోరారు. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి సోలార్ విద్యుత్ పరికరాలను రాయితీపై మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నరసన్నపేటలోని మారుతీనగర్‌లో జామి వెంకటరావు ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ పరికరాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్‌శాఖ ఏడీ ఇందిర మాట్లాడుతూ మండలంలో 62 దరఖాస్తులు వచ్చాయని, 18 మంది డబ్బులు చెల్లించారని తెలిపారు. తొమ్మిది చోట్ల సోలార్ పరికరాలు అమర్చామని వివరించారు. ఎంపీడీఓ మధుసూదనరావు, ఏఈ కోటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కనీసం ఇద్దరు వినియోగదారులకు సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ పరికరాలు అమర్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వినియోగదారుడు జామి వెంకటరావు మాట్లాడుతూ సోలార్ పరికరాలు అమర్చి మూడు నెలలు అవుతుందని, విద్యుత్ బిల్లు బాగా తగ్గిందన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం

**ఎచ్చెర్ల క్యాంపస్:** ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయరావు సిబ్బందికి సూచించారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం మూడో రోజు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 340 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఉండగా, ఇప్పటికి 140 మందికి శిక్షణ పూర్తిచేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 100 మందికి ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి మిగిలిన కార్యకర్తలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లాలో ఎంపిక చేసిన 45 వేల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేర్పిస్తామని తెలిపారు.

## ర్యాగింగ్‌తో జీవితం నాశనం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ర్యాగింగ్ వంటి చర్యలతో భవిష్యత్తు అంధకారంగా మారుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం వరకట్న నివారణ, యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌పై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమన్నారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇందిరా ప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.